డంపింగ్ కేంద్రంగా కాల్వ రోడ్డు!

- ప్లాస్టిక్ కంపెనీల వ్యర్థాలతో ఇబ్బందులు
- కాల్వ నీరు సైతం కలుషితం
- పట్టించుకోని పోలవరం ప్రాజెక్ట్ అధికారులు



భారీగా డంప్ అయిన వ్యర్థాలు

విజయవాడరూరల్: వ్యర్థాల డంపింగ్ కేంద్రంగా నున్న గ్రామంలోని పోలవరం కాల్వ రోడ్డు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పోలవరం ప్రాజెక్ట్ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో నున్న, సూరంపల్లి గ్రామ పంచాయతీల్లో సేకరించిన చెత్తను పోలవరం కాల్వ రోడ్డు పెద్ద మొత్తంలో డంప్ చేస్తున్నారు. వీటితో పాటు సూరంపల్లి ఇండస్ట్రియల్ ఏరియా నుంచి చెప్పుల కంపెనీల్లో వ్యర్థాలు, పాలిథిన్ కవర్లు తయారు చేసే వ్యర్థాలు, విజయవాడ శివారు ప్రాంతాల్లో వివిధ కంపెనీల్లోని వ్యర్థాలను సైతం ఇక్కడే డంప్ చేస్తున్నారు. పొద్దుపోయిన తర్వాత డంప్ చేయడం వలన ఈ వ్యవహారం గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతోంది. ఇటీవల పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ నున్న గ్రామంలో ఉపాధి నిధులతో నిర్మించిన పశువుల షెడ్డును ప్రారంభించేందుకు వచ్చిన సందర్భంలో పోలవరం కాల్వ ప్రాంతం వ్యర్థాలతో నిండి ఉండటంతో హడావిడిగా అధికారులు నిప్పు పెట్టారు. మంటల్లో కాలిపోయిన వివిధ రకాల రసాయనాలు, కెమికల్స్‌తో తయారు చేయబడిన చెప్పులు, ప్లాస్టిక్ కంపెనీల వ్యర్థాల నుంచి వెలువడిన పొగతో వచ్చిన కెమికల్స్ వాసనకు నున్న గ్రామంలోని ప్రజలు అల్లాడిపోయారు. ముఖ్యంగా టీచర్స్ కాలనీ, హృదయనగర్ కాలనీ, ఎస్సీ కాలనీ ప్రజలు రెండు గంటల పాటు వాసన పీల్చడానికే భయపడిపోయారు.

నిర్లక్ష్యంగా అధికారుల వైఖరి....

పోలవరం కాల్వ ద్వారా వచ్చే నీటిని నున్న గ్రామ పంచాయతీ తాగునీటిగా చెరువు ను నింపి ప్రజలకు సరఫరా చేస్తోంది. దీంతో పాటు ఇబ్రహీంపట్నం త్రివేణి సంగమం వద్ద కలిసే నీరు పోలవరం నీటితో కలుషితమవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. పోలవరం కాల్వ నీటినే గ్రామాల్లో రైతులు పంట పొలాలకు పెట్టుకోవడంతో కలుషితమవుతున్నాయని రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కాల్వ సమీప ప్రాంతాల ప్రజలకు దుర్వాసన వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్త డంపింగ్ గుంటూరులోని జిందాల్ కంపెనీకి తరలించాల్సి ఉండగా ఆదిశగా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. దీంతో చెత్త డంపింగ్‌తో పాటు వివిధ రకాల ప్రమాదకరమైన వ్యర్థాలతో నున్న-సూరంపల్లి గ్రామాల పొలిమేరలోని పోలవరం కాల్వ రోడ్డు భయానకంగా తయారైంది. పర్యావరణానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వ్యర్థాలను తొలగించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

దుర్వాసనతో ఆరోగ్య సమస్యలు



నున్న పోలవరం కాల్వ రోడ్డు లో చెత్త తో పాటు వివిధ వ్యర్థాలను డంప్ చేసి నెలల తరబడి నిల్వ ఉంచడం వలన వాటి నుంచి వెలువడే దుర్వాసనతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. వ్యర్థాలను డంప్ చేయకుండా సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి.

-ముల్లంగి రాజు, నున్న

చర్యలు తీసుకుంటాం



చెత్తను గుంటూరు లో జిందాల్ సంస్థకు పంపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. పోలవరం కాల్వ రోడ్డులో పేరుకు పోయిన చెత్త సుమారు రెండువేల టన్నులు ఉంటుంది. దాన్ని జిల్లా అధికారులు పరిశీలన చేశారు. త్వరలోనే తరలించేందుకు చర్యలు తీసుకుంటాం.

-మన్నే వెంకట ప్రసాద్, ఈవోఆర్డీ

టీడీపీ విజయం కోసం పనిచేస్తే కనీస గుర్తింపు లేదు

కేసరపల్లి(గన్నవరం): గత ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం శక్తివంచన లేకుండా పనిచేశాం... తీరా అధికారంలోకి వస్తే కనీస గుర్తింపు కూడా ఇవ్వడం లేదు... పార్టీ సమావేశాలకు కూడా పిలవడం లేదు... ఈ పద్ధతి పార్టీకి మంచిది కాదు...వైఖరి మార్చుకోకపోతే నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తామని మండలంలోని కేసరపల్లికి చెందిన టీడీపీ నేతలు తేల్చిచెప్పారు. సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గ్రామానికి విచ్చేస్తున్న సందర్భంగా గురువారం పార్టీ సమావేశం నిర్వహించారు. నేతల మధ్య వాగ్వాదాలు వల్ల ఘర్షణ వాతావరణం నెలకొనడంతో మధ్యలోనే సమావేశం ముగించారు. అయితే ఈ సమావేశానికి టీడీపీకి చెందిన మాజీ ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, ఉపసర్పంచ్ జాస్తి శ్రీధర్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు కొంతి కిషోర్‌ను పిలవకపోవడంపై వీరంతా అక్కడికి వెళ్లి మిగిలిన నేతలను నిలదీశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి కనీస గౌరవం ఇవ్వకపోవడం ఏంటని గట్టిగా ప్రశ్నించారు. అయితే ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు వీరిని సమావేశానికి పిలవలేదని చెప్పడంతో గొడవ మరింత పెద్దదైంది. చివరికి తోపులాటకు దిగడంతో సమావేశం ముగించి నేతలు ఇంటి దారి పట్టారు.

క్లుప్తంగా

మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలి
జడ్జి అరుణశ్రీ



గన్నవరం:స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వ-దేశం కోసంపై ఏర్పాటు చేసిన స్టాల్‌ను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, సబ్‌కోర్టు జడ్జి డాక్టర్ ఎస్. అరుణశ్రీ మాట్లాడుతూ. కక్షిదారులు మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని చెప్పారు. దీనివల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఐ. శైలజాదేవి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్. గాయత్రి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీరు సరఫరాకై చర్యలు

రామవరప్పాడు: గ్రామంలో సురక్షిత తాగునీరు సరఫరా కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు 24వ కల్యాణ మండపం సమీపంలో గురువారం రూ.1.20 లక్షల లీటర్ల వాటర్ ట్యాంక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ నిధులు సుమారు రూ.64లక్షలతో ట్యాంకు నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామంలోని విజయ ఆగ్రోకట్ట, ఎస్సీ కాలనీ, కొడాలివారి వీధి, జెండా చెట్టు సెంటర్ తదితర ప్రాంతాల్లో ఈ ట్యాంక్ ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. కాల్వ గట్టు ప్రాంతాల్లో మోటారు బోర్లు సహాయంతో తాగునీరు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాచమళ్ల శ్రీనివాసరావు, కోనేరు నారాయణ పాల్గొన్నారు.

నామమాత్రపు వడ్డీకే రుణాలు

పెనమలూరు:చిన్న, మధ్య తరహా వ్యాపారులు కాల్‌మనీ బారిన పడకుండా ఉండటమే లక్ష్యంగా సహకార సొసైటీలు పని చేస్తున్నాయని గోదావరి-కృష్ణా సహకార సొసైటీ ఛైర్మన్ మేడూరి జీవన్ వెంకట్రావు అన్నారు. తాడిగడప జంక్షన్‌లో గురువారం జరిగిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ బ్యాంకు చిరు వ్యాపారులకు నామమాత్రపు వడ్డీతో రుణాలు ఇస్తున్నామన్నారు. త్వరలో డ్వాక్రా పొదుపు సంఘాల మాదిరిగా నారీ సంకల్ప పేరుతో పథకాన్ని ప్రవేశ పెట్టి రుణాలు ఇస్తామని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 12 శాఖలు ఉండగా నెలాఖరుకల్లా అవనిగడ్డ, కైకలూరు, హనుమాన్‌జంక్షన్, గన్నవరం, విసన్నపేట, జగ్గయ్యపేట, మైలవరం, తారువూరు, రామవరప్పాడు ప్రాంతాల్లో కొత్తగా శాఖలు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ కె.నిరీక్షణ్, సీతారామ్, సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరీ అలంకరణలో కనకదుర్గమ్మ



హనుమాన్‌జంక్షన్ రూరల్:బాపులపాడు మండలం వీరవల్లిలోని కనకదుర్గమ్మ తల్లి దేవస్థానంలో శాకంబరి ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. అమ్మవారిని రకరకాల కూరగాయలతో విశేషంగా అలంకరించారు. ఆలయంలో శాకంబరీ అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారి దర్శించుకునేందుకు వీరవల్లి, ఉమామహేశ్వరపురం, కోడూరుపాడు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త వంగపండు ప్రకాష్ నేతృత్వంలో ఊరేగింపుగా అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజుల, పుష్పాలు, చలిమిడి, పండ్లు, వస్త్రాలను ఆషాఢం సారెగా తీసుకువచ్చారు. మేళతాళాలు, వేద మంత్రోర్ఛణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాకంబరీదేవిగా లక్ష్మీతిరుపతమ్మ



గన్నవరం:గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక పాతగన్నవరంలో కొలువైన లక్ష్మీతిరుపతమ్మ దేవస్థానంలో గురువారం శాకంబరీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ ఉత్సవమూర్తులను, ఉపదేవత అంకమ్మతల్లిని, ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అందంగా అలంకరించారు. అనంతరం శాకంబరీదేవి అలంకరణలో ఉన్న అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులచే లలితా సహస్రనామ పారాయణం, లక్ష్మీ, అన్నపూర్ణ అష్టోత్తరాలు, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన కదంబ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, పలువురు కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు, పరిసరా ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మొక్కుబడిగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు



హెచ్‌ఎం, టీచర్స్‌ను సత్కరిస్తున్న యార్లగడ్డ



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు

గన్నవరం:ఉంగుటూరు, గన్నవరం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు మొక్కుబడిగా జరిగాయి. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులను పుణ్య చారిటీస్ ఆధ్వర్యంలో సత్కరించారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసాని, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, సర్పంచి నిడమర్తి సౌజన్య, ఎంపీటీసీ సభ్యులు పడమట రంగారావు పాల్గొన్నారు. సెయింట్‌జాన్స్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ నేతృత్వంలో అవగాహన కల్పించారు.

క్రమశిక్షణతో చదవాలి....

పెనమలూరు:విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని ఎమ్మెల్యే బోడెప్రసాద్ అన్నారు. పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన మెగ పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎంపీడీవో బండి ప్రణవి, మండల విద్యాశాఖ అధికారులు బీవీ.శేషగిరిరావు, ఎం.కనకమహాలక్ష్మి, హెచ్‌ఎం ఎం.సుమలత పాల్గొన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం జీబీకె.సుధారాణి మాట్లాడారు. అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కిలారు శివకుమార్ 300 భోజనం ప్లేట్లు బహూకరించారు. క్రీడల నిర్వహణకు దాత కిలారు బసవపున్నయ్య రూ.10 వేలు అందచేశారు. పాఠశాల కమిటీ ఛైర్మన్ ఖైరంభి, గ్రామస్తులు సత్యనారాయణ, బ్రహ్మాజీ, బేబీసరోజిని, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉయ్యూరు: ఉయ్యూరులోని పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ సమావేశం గురువారం నిర్వహించారు. ఆయా స్కూళ్లలో విద్యార్థులు, తల్లిదండ్రులకు వివిధ అంశాల్లో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

రామవరప్పాడు: రామవరప్పాడు, నిడమానూరు, ఎనికేపాడు, ప్రసాదంపాడు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. దాత కొడెబోయిన శ్రీనివాస కృష్ణ పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ 10వేలు చొప్పున నగదు బహుమతి, 22 మంది విద్యార్థులకు గిఫ్ట్ ఆర్టికల్స్ అందజేశారు.

విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు....

హనుమాన్‌జంక్షన్ రూరల్:విద్యార్థి దశ నుంచే చిన్నారులకు నైతిక విలువలు, క్రమశిక్షణ నేర్పించటం ద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ వి.సురేష్ అన్నారు. బాపులపాడు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహించారు. ఆయా జెడ్పీ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు ఎస్.పద్మజ, ఎం.శ్రీనివాసరావు, పి.నిర్మల, లూథర్ పాల్, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, స్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్ పాల్గొన్నారు. కానుమోలులోని చింతా సీతయ్య జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యార్థులు తమ తల్లులకు పాదపూజ చేసి ఆశీస్సులు అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కృపావతి, లెక్చరర్లు, పూర్వ విద్యార్థి కమ్మిలి వీర వెంకట సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

విద్యార్థి దశ ఎంతో కీలకం....

నున్న(విజయవాడరూరల్): తల్లిదండ్రులు విద్యార్థుల చదువులు, క్రమశిక్షణకు సంబంధించిన విషయాల పై శ్రద్ధ చూపాలని విజయవాడ రూరల్ జెడ్పీటీసీ కె.సువర్ణరాజు సూచించారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో మెగా పేరెంట్స్, టీచర్ల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితంలో ఎంతో విలువైందన్నారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్. రవిప్రసాద్ పాఠశాల ప్రగతి నివేదిక చదివారు. ఎస్ఐ విమల సైబర్ క్రైమ్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియచేశారు. అనంతరం విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. విద్యార్థులందరితో తల్లికి వందనం, తల్లులకు పుష్పార్చన, నమస్కార కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులకు లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. విశ్రాంత హెచ్‌ఎం వి.భూపాల్‌రెడ్డి, పంచాయతీ వార్డు సభ్యులు కాటూరి శ్రీనివాసరావు, గంపా శ్రీనివాస్‌యాదవ్, యర్కారెడ్డి కోటిరెడ్డి, సమగ్రశిక్షా సిఎంఒ ఎస్.చంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు. ఎస్ఎంసి ఛైర్మన్ గడ్డం కుమార్ వందన సమర్పణ చేశారు.


గన్నవరం ఆర్టీసీ డిపోను సందర్శించిన డీపీటీఓ



ప్రశంసాపత్రం అందజేస్తున్న డీపీటీఓ వెంకటేశ్వర్లు

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపోను గురువారం జిల్లా ప్రజా రవాణా అధికారి కొడమంచిలి వెంకటేశ్వర్లు సందర్శించారు. తొలుత బస్టాండ్ పరిసరాలను పరిశీలించిన ఆయన ప్రయాణికులకు అందిస్తున్న సదుపాయలపై సమీక్షించారు. అనంతరం డిపోలోని గ్యారేజ్‌ను సందర్శించి సిబ్బంది పనితీరు, బస్సుల కండీషన్ గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా డీపీటీఓ మాట్లాడుతూ మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలుకు సిబ్బంది సమాయత్తం కావాలని చెప్పారు. బస్సుల కండీషన్‌ను మెరుగు పరచాలని సూచించారు. సంస్థ ఖర్చులను తగ్గించి, ఆదాయాన్ని పెంచే విధంగా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అనంతరం జూన్ నెలలో ఉత్తమ పనితీరు కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు ఆయన అందజేశారు. డీఎం పి. శివాజీ, ఎస్టీఐ మధు, ఎంఎఫ్ వెంకటేశ్వరరావు, పలువురు ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



నున్నలో సాయిబాబాకు అలంకారం



కానూరులో ప్రత్యేక అలంకరణలో స్వామి



ప్రొద్దుటూరు గాయత్రీ విహార్‌లో పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యూరు: గురుపౌర్ణమి పర్వదినాన్ని భక్తులు గురువారం అంతటా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉయ్యూరు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని తోట్లవల్లూరు రోడ్డులోని షిరిడీ సాయిబాబా మందిరం, గండిగుంటలోని సాయిబాబా ఆలయం, కేసీపీ సాయిబాబా ఆలయాల్లో పంచామృతాభిషేకాలు చేశారు. అన్నసమారాధన చేయించారు. మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్ర ప్రసాద్, మున్సిపల్ ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, మాజీ ఛైర్మన్ జంపాన పూలా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొని బాబాను దర్శించుకుని పూజలు జరిపించారు.

గురుపౌర్ణమి పూజలు

పెనమలూరు:కానూరు గ్రామంలో ఉన్న సాయిగీతామందిరంలో గురువారం గురుపౌర్ణమి మహోత్సవం ఘనంగా చేశారు. సాయి మందిరంలో షిరిడీ సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం 108 కలశాలతో ప్రత్యేక పూజలు చేశారు. 108 లీటర్ల ఆవు పాలతో బాబాకు అభిషేకం చేశారు. 108 రకాల పూలతో బాబాకు పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబాను దర్శించుకోని ప్రత్యేక భజనలు చేశారు. అనుమోలు హోం ఫుడ్స్ ఆధ్వర్యంలో భక్తులను అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో గురుపూర్ణిమ

కంకిపాడు: గురుపూర్ణిమ పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గురుపూర్ణిమ సందర్భంగా గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లోని ధ్యాన యోగ సాయి మందిరంలో సాయిబాబా వారికి భక్తులు పంచామృత అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, గురుపాదుక అష్టోత్తరం, సహస్రనామార్చన, హారతులు ఇచ్చి పూజించారు. పల్లకీ సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గాయత్రీ విహార్ భక్త బృందం అసోసియేషన్ ప్రతినిధులు పర్యవేక్షించారు.

నున్న(విజయవాడరూరల్): గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆషాఢ శుద్ధ పౌర్ణమి-వ్యాస జయంతి నాడు కాకడ హారతి, గోపూజ, విశేష పంచామృతాలతో అభిషేకం చేసిన తర్వాత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబావారికి పాలాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబావారిని పూజించారు. మందిరం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు భీమవరపు సుబ్బారెడ్డి, కార్యదర్శి రవీంద్రరెడ్డి, మహిళా కార్యదర్శి అవుతు మాధవీలత పాల్గొన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి

హనుమాన్‌జంక్షన్ రూరల్:బాపులపాడు మండలం వీరవల్లిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి పర్వదినాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి ఆలయంలో బాబాకు విశేష పూజలు నిర్వహించారు. తొమ్మిది రకాల పండ్ల రసాలతో అభిషేకం, అష్టోత్తరం, కుంకుమార్చన, భజన సంకీర్తన నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. గ్రామానికి చెందిన వడ్లపూడి లక్ష్మీ పెరుమాళ్లు రూ.54 వేలు విరాళాన్ని అన్నదాన కార్యక్రమం ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు బాబి, రావి ఈశ్వర్, తవ్వా ఆదిలక్ష్మీ, గుత్తా నాగమణి, మాచినేని బాలకృష్ణ, బేబి సరోజిని పాల్గొన్నారు.

తొలి అడుగులో సమస్యల ఏకరువు

నున్న(విజయవాడరూరల్): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యల వెల్లువెత్తుతున్నాయి. నున్న గ్రామంలో గురువారం తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌కు గ్రామస్తులు సమస్యలు ఏకరువు పెట్టారు. గ్రామంలో తాగునీరు ఫిల్టర్ కావడం లేదని బోరు నీటిని సరఫరా చేస్తున్నారని ఏఎంసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు దండు సుబ్రహ్మణ్యం రాజు ఎమ్మెల్యేకి వినతి పత్రం అందచేశారు. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగాయని ఆర్‌అండ్‌బీ రోడ్డుకు డ్రెయినేజీ కాల్వ నిర్మించాలని ఆ వినతిపత్రంలో కోరారు. తాగునీటిని ఫిల్టర్ చేయించి ప్రజలకు సరఫరా చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ అధికారులను ఆదేశించారు. ఇళ్ల స్థలాల దరఖాస్తులు ఆన్‌లైన్లో తీసుకోవడం లేదని మహిళలు చెప్పడంతో ఆఫ్‌లైన్లో దరఖాస్తులను స్వీకరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అర్హులైన వారికి ఇళ్ల స్థలాలను అందచేస్తామన్నారు. రేషన్ కార్డులు దరఖాస్తులు కూడా స్వీకరించడం లేదని, కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇంతవరకు పంపిణీ చేయలేదన్నారు. జగనన్న కాలనీలో రోడ్లు నిర్మించాలని తాగునీరు సరఫరా చేయాలని కాలనీ ప్రజలు కోరారు. రోడ్ల నిర్మాణానికి ఎస్టిమేట్లు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. తొలుత రూ.37 లక్షలతో నిర్మించిన బీటి రోడ్డు ను ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. పోలవరం కాల్వ నీటిని చెరువులకు పంపేందుకు స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. గౌడబజారులో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో ప్రసంగిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు

కంకిపాడు: పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ పలువురు తల్లిదండ్రులు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు విన్నవించారు. కంకిపాడు జెడ్పీ పాఠశాలలో పేరెంట్స్-టీచర్స్ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు వేదికపై పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రస్తావించారు. విద్యార్థులకు తగినంతగా తాగునీరు అందటం లేదని, మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా ఉంటున్నాయని వాపోయారు. ఆట స్థలం లేకపోవటంతో క్రీడలకు దూరమవుతుందని వివరించారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు-నేడుతో విద్యాప్రగతి చోటుచేసుకుందని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. పేరెంట్స్-టీచర్స్ సమావేశాల్లో భాగంగా కంకిపాడు, పునాదిపాడు, ఈడుపుగల్లు, ఉప్పలూరు తదితర పాఠశాలల్లో సమావేశాలకు బాకీ బాబు హాజరయ్యారు. ఆయా సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో వసతుల కల్పనకు గత ప్రభుత్వం కృషి చేసిందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెనమలూరు:తాడిగడప, పెదపులిపాక గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. తాడిగడప సబ్‌స్టేషన్ మరమ్మతులు కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. దీని కారణంగా తాడిగడప గ్రామంలో, ఎస్‌టీబీఎల్‌కాలనీ, ఊరచెరువు ప్రాంతాలతో పాటు పెదపులిపాక గ్రామంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ సిబ్బందికి స్థానికులు సహకరించాలని కోరారు.

- గన్నవరం రూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మండలంలోని వీరపనేనిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటరాజు తెలిపారు. వీరపనేనిగూడెం ఏరియా మొత్తం సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

మహాత్మాగాంధీ విగ్రహం ఏర్పాటుపై హైకోర్టు స్టేటస్ కో

గన్నవరం:స్థానిక గన్నవరం-ఆగిరిపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణలో భాగంగా గాంధీచౌక్‌లో ఏర్పాటు చేయనున్న మహాత్మాగాంధీ కాంస్య విగ్రహం ఏర్పాటుకు బ్రేకులు పడ్డాయి. పరిసర ప్రాంత దుకాణదారుల దాఖలు చేసిన పిటీషన్ మేరకు ఏపీ హైకోర్టు విగ్రహం ఏర్పాటుపై స్టేటస్ కో ఇచ్చింది. గతంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న మహాత్ముని పాత విగ్రహం తొలగించి వ్యాపార దుకాణాలకు ఎదురుగా కొత్త కాంస్య విగ్రహం ఏర్పాటుకు ఇటీవల శంకుస్థాపన చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహం ఏర్పాటు చేయడంపై దుకాణదారులు అన్నే విజయ్‌కుమార్, సుధాలక్ష్మీ రాష్ట్ర హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్‌ను పరిశీలించిన హైకోర్టు యథాతథస్థితిని కొనసాగించాలని ఆదేశిస్తూ స్టేటస్ కో జారీచేసింది. కోర్టు ఉత్తర్వులను పిటీషన్ దారులు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, గ్రామపంచాయతీ అధికారులకు కూడా అందజేశారు. అయినప్పటికి విగ్రహ నిర్మాణానికి అధికారులు అవసరమైన మెటీరియల్‌ను సిద్ధం చేయడంపై పిటిషన్ దారుడైన విజయకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా అధికారులు లెక్కచేయకపోవడం బాధకరమన్నారు. ఇక్కడ విగ్రహం పెట్టడం వల్ల నివాస గృహాలు, దుకాణాలకు ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. ప్రధాన రోడ్లపైన, ప్రజా రవాణాకు ఆటంకం కలిగించే విగ్రహాలు ఏర్పాటు పెట్టవద్దని గతంలో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఇప్పటికైనా అధికారులు న్యాయస్థానాల తీర్పులకు అనుగుణంగా యథాతథస్థితిని కొనసాగించాలని కోరారు.

ఘనంగా ఆషాఢం సారె సమర్పణ

హనుమాన్‌జంక్షన్ రూరల్:బాపులపాడు మండలం పెరికీడులో గ్రామ దేవత గంగానమ్మ తల్లికి మహిళలు ఆషాఢం సారెను మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామ కూడలి నుంచి పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చలిమిడి, పండ్లుతో ఆషాఢం సారె తీసుకుని మేళతాళాలతో ఊరేగింపుగా గంగానమ్మ తల్లి దేవస్థానానికి చేరుకున్నారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ఈ ఏడాది పాడిపంటలు సమృద్ధితో వర్ధిల్లాలి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు నండూరి సత్య వెంకటేశ్వర శర్మ, నక్కా బాబు, జెట్టి సీతమ్మ, పుట్టి రాంబాబు, మెరుగుమాల వేణు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత



పెదపులిపాక గ్రామంలో విద్యార్థులకు ప్రోత్సాహాలు అందించిన దాతలు

పెనమలూరు:పెదపులిపాక గ్రామంలోని యూపీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దాతలు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. పాఠశాలలో గురువారం సర్పంచ్ గుంటూరు శ్రీనివాస చౌదరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాతలు వల్లూరు శ్రీమన్నారాయణ, మోహన్‌రావు పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన అద్దేపల్లి ప్రణీతకు రూ.5 వేలు ఉపకార వేతనం అందచేశారు. అలాగే పాఠశాలలో పలువురు విద్యార్థులకు నగదు బహుమతులు పంపిణీ చేశారు. పాఠశాలకు వాటర్ కూలర్ బహూకరించారు. విద్యార్థులకు భోజనం పెట్టారు. గ్రామంలో దాతలు ముందుకు వచ్చి విద్యార్థులను ప్రోత్సహించాలని హెచ్‌ఎం వీఎస్‌కే.ప్రసాద్ కోరారు. ఎస్ఎంసీ ఛైర్మన్ నందేటి శ్రావణి, గ్రామ పెద్దలు వల్లూరు శ్యామ్‌ప్రసాద్, ముసునూరు గోపాలకృష్ణ, చనుమోలు సంపూర్ణమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకటరత్నం, సచివాలయ సిబ్బంది, పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామస్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీటీఎంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ

ఆత్కూరు(గన్నవరం):ఉంగుటూరు మండలం ఆత్కూరు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆయన విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎస్పీ మధ్యాహ్న భోజనం చేశారు. డీఎస్పీ సిహెచ్. శ్రీనివాసరావు, ఎంపీపీ వడ్లమూడి సరోజిని, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.